# సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సర్వే షురూ

## జడ్చర్లలో రూ.10కోట్లతో ఏర్పాటు కానున్న వాకింగ్ ట్రాక్

**జడ్చర్ల, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ఎట్టకేలకు జడ్చర్లకు సింథటిక్ ట్రాక్ మంజూరు కావడంతో క్రీడాకారులు, మార్నింగ్ వాకర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు జడ్చర్ల డా.బి.ఆర్.ఆర్ కాలేజ్ స్టేడియం గ్రౌండ్ లో మార్నింగ్ వాక్ చేసే వాకర్స్ కోసం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హామీ ఇచ్చి, మంజూరు చేసిన సింథటిక్ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కార్యరూపం దాల్చింది. మహబూబ్ నగర్ పంచాయతీరాజ్ డి.ఇ విజయశేఖర్,జడ్చర్ల పంచాయతీరాజ్ ఎ.ఇ ఉపేందర్ రెడ్డి లు సర్వే నిర్వహించి డిపిఆర్ సిద్ధం చేశారు. డిఇ మాట్లాడుతూ జిల్లా యూత్ మరియు స్పోర్ట్స్ అధికారి మరియు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్స్) నుండి వచ్చిన ఉత్తర్వుల మేరకు 400 మీటర్లు పొడవు,8 లైన్లు గా సింథటిక్ వాకింగ్ ట్రాక్,వాష్ రూంల ఏర్పాటు ఎస్టిమేషన్, మ్యాప్, డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయడం జరిగింది అని దాదాపు 10 కోట్లతో ఏర్పాటు కానున్నదని తెలిపారు. ఈ సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ది బాలకృష్ణ పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న అధికారులు, పెద్ద బాలకృష్ణ


మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

## వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తిక్రైమ్ డిసెంబరు 30 ప్రభాతవార్త:**ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపుకలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించటంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ప్రజావాణి ఫిర్యాదులతో పాటు సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన ఫిర్యాదులను సైతం వారంలో పరిష్కరించాలని అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 37 అర్జీలు వచ్చాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

### గద్వాల జిల్లాలో..



ప్రజల నుండి దరఖాస్థులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల ప్రతినిధి డిసెంబరు 30 ప్రభాతవార్త :** ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లాకలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశం హాలు నందు ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు కలెక్టర్ సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం మొత్తం (65) ఫిర్యాదులు అందాయని, వచ్చి న దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.ఈకార్యక్రమంలో అదనపుకలెక్టర్లు నర్సింగ్ రావు,లక్ష్మి నారాయణ, వివిధ శాఖ జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

### నారాయణపేటలో..



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్త పట్నాయక్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి కలెక్టర్ సిక్త పట్నాయక్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణికి సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయవద్దని సూచిం చారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా 39 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.కొన్ని దరఖాస్తులను సంబంధిత అధికారులకు సమావేశ మందిరంలోనే అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్, ఏవో జయసుధ ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### నాగర్‌కర్నూల్ జిల్లాలో..



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 24 ప్రభాతవార్త:**సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 26 ఫిర్యాదులు అందాయని తెలియజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కే సీతారామారావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేపడుతూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మత్స్య సంపద మాయం !



కృష్ణ తీరంలో చేపల వేట కోసం ఏర్పాటు చేసిన స్థావరాలు

**అధికారులు, నాయకుల కుమ్మక్కుతో ఖాళీ అవుతున్న కృష్ణానది**

**అలవి వలతో ఉపాధి కోల్పోతున్న స్థానిక జాలర్లు**

**పలుమార్లు హెచ్చరికలు చేసిన అదే తంతు**



ఎండబెట్టిన సన్నటి గుడ్డు లాంటి చేపలు

**చిన్నంబావి, డిసెంబరు 30 ప్రభాతవార్త :** రాష్ట్రంలో మత్స్య సంపద అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను కొనసాగిస్తున్న, స్థానిక జాలర్ల ఉపాధినీ, అభివృద్ధినీ ఇతర ప్రాంతాల జాలర్ల చేపల వేటతో స్థానిక జాలర్ల ఉపాధిని దెబ్బతీస్తున్నది. రాష్ట్రాలు దాటి,ప్రాంతీయేతరుల జాలర్లు వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని కృష్ణా నది తీర ప్రాంతంతో గుట్టుగా చేపల వేట కొనసాగిస్తున్నారు. పెద్ద చేపల తో పాటు సన్నటి గుడ్డు లాంటి చేపలను సైతం అలవి వలతో వేటాడుతూ లక్షలు గడిస్తున్నారు.. ఇదేంటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తే! భౌతిక దాడులకు ఎగబడుతున్నారు. ఇలా కొన్ని సంవత్సరాలుగా ఆంధ్ర ప్రాంతానికి చెందిన జాలర్లు మండల పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక నేతలతో చేతులు కలిపి నిషేధిత అలివి వలతో చేపల వేట కొనసాగిస్తూ... స్థానిక జాలర్లకు ఉపాధి లేకుండా చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపల పెంపకాని ప్రోత్సహిస్తూ లక్షలాది చేప పిల్లలను పెంచి స్థానిక చెరువులు, కుంటలు, నదులలో వదిలిపెడుతూ మత్స్యకారుల ఉపాధిని కొనసాగిస్తుండడం జరుగుతుంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ కృష్ణా నదిలో లక్షలాది చిన్న చేప పిల్లలను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేస్తుంది. అవి పెరిగి పెద్ద సైజులో ఉన్నప్పుడు వేటాడాల్సిన స్థానిక జాలర్ల పొట్ట కొడుతూ.. సన్నటి గుడ్డును సైతం అలివి వలలతో పడుతూ... మత్స్య సంపదను దోపిడీ చేస్తున్నారు. గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్, ఎస్పీ, డిఎస్పి, మత్స్య శాఖ ఏడి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి స్థానిక జాలర్లకు సూచనలు చేయడం జరిగింది. పలుమార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసిన, చేపల వేట కొనసాగుతూనే ఉంది. ఇటీవల ఆంధ్ర ప్రాంతానికి చెందిన కొవ్వూరు, రాజమండ్రి, వైజాగ్ జాలర్లు అలివివలతో చేపలు పడుతుండడంతో సమాచారం తెలుసుకొని దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి. అయినా కూడా స్థానిక లీడర్లు,అధికారులతో కుమ్మక్కై ఇతర ప్రాంత జాలర్లు అక్రమ చేపల వేట కొనసాగిస్తూ లక్షలు గడిస్తున్నారు. ఏది ఏమైనా! ప్రభుత్వ ఉద్దేశాన్ని నీరుగాడ్చి స్థానిక జాలర్ల ఉపాధి పై దెబ్బకొడుతూ కృష్ణా నది తీరంలో కొనసాగుతున్న అక్రమ చేపల వేట పై ప్రభుత్వం దృష్టి సారించి ఉక్కు పాదంతో అణచి వేస్తే తప్ప, నిషేధిత చేపల వేట ఆగడం జరగదు. ఇట్టి విషయంపై స్థానిక జాలర్లు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎన్ని



అలవి వలలపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

వినతులు ఇచ్చినా, తూతూ మంత్రంగా సాగుతోంది. చిన్నంబావి మండలం కృష్ణ తీరం వెంబడి పలు అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు కావడంతో ఒకవైపు దాడులు చేస్తే, మరోవైపు వెళ్లి దాకోవడం జాలర్లకు వెన్నెతో పెట్టిన విద్య, భౌగోళికంగా చిన్నంబావి మండలం సుదూరమైన కృష్ణ తీరం,మూడు జిల్లాలు జోగులాంబ గద్వాల జిల్లా, నాగర్ కర్నూల్ జిల్లా, స్థానిక వనపర్తి జిల్లా, ఒక అంతర్రాష్ట్ర హద్దు.. ఆంధ్ర ప్రదేశ్ తో సరిహద్దును కలిగి ఉండడంతో ఒక్కో పరిధిలో ఒక్కోసారి దాడులు నిర్వహిస్తే, మరో ప్రాంతంలో తలదాచుకునే అవకాశం జాలర్లకు కల్పిస్తున్నాం.. ఏకకాలంలో ఒకేసారి దాడులు నిర్వహిస్తే, నిషేధిత అలివి వలను నివారించడం సులభం ఈ విషయంలో ఆయా జిల్లాల మత్స్యశాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, స్థానిక ప్రజా ప్రతినిధులు కలిసి దాడులు నిర్వహిస్తే తప్ప నిషేధిత అలవి వలను నివారించలేము.

### అలవివలను నివారించాలి..



కృష్ణా నదిలో ప్రభుత్వం చేపలు వదిలిన వెంటనే గుడ్డు లాంటి చాపలను సైతం అలవివలతో వేటాడడం జరుగుతుంది. వీటిని నివారిస్తే, స్థానిక జాలర్లకు మేలు జరుగుతుంది. నిషేధిత అలవి వలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి.

*బాల కిష్టయ్య బెక్కెం గ్రామ మత్స్య సంఘం అధ్యక్షుడు*

### దాడులు నిర్వహించి కేసు నమోదు చేస్తున్నం..



కృష్ణ తీరంలో ఆలవి వల వేట జరుగుతుండడం గమనించి రెండుసార్లు దాడులు నిర్వహించి కేసు నమోదు చేశాము.. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు ఉండడంతో ఒకేసారి దాడులు నిర్వహించడం ఇబ్బందిగా మారింది. రాత్రి వేళల్లో నిషేధిత ఆలవి వల వేట కొనసాగుతుంది. రాత్రి వేళల్లో గస్తీ కాసి దాడులు నిర్వహిస్తున్నాం.

*చిన్నంబావి ఎస్ఐ జగన్ మోహన్*

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజావాణి కార్యక్రమంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కల్లెక్టరేట్ సమావేశం హాలులో జరిగిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు అందించిన ప్రజా వినతులు, ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావులతో కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం (82) దరఖాస్తులు రాగా రెవెన్యూ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయని, వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు,ఆన్ లైన్ లో మండల తహసిల్దార్ లు,ఎం.పి.డి. ఓ లు,మున్సిపల్ కమిషనర్ లతో ఇందిరమ్మ ఇండ్ల సర్వేపై మండలాలు, మున్సిపాలిటీల వారీగా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు దరఖాస్తుల పరిశీలన సరాసరి 74 శాతం ఉందని సిసి కుంట, గండీడ్, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, భూత్పూర్ మండలంలో దరఖాస్తుల సర్వే జిల్లా సరాసరి కంటే తక్కువగా ఉందని తెలిపారు. కొన్ని పంచాయతీలలో 35 శాతం కంటే తక్కువగా సర్వే పూర్తి అయిందని తెలిపారు. ఆయా మండలాల ఎం.పి.డి.ఓ లు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వేలో వెనుకబడిన పంచాయతీ లలో ప్రత్యేక శ్రద్ధ కనబరచి సర్వే త్వరగా పూర్తి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

చేయుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపిడిఓలు ఐదు శాతం సర్వే సూపర్ చెక్ చేయాలని సూచించారు. ఎంపిడిఓ లకు లాగిన్‌లు కేటాయించినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే లో వేరే ప్రాంతానికి వెళ్లిన వారు, డోర్ లాక్ ఉన్న ఇండ్లు, రెండు చోట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతంలో దరఖాస్తు చేసుకున్న వారి పై ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనలు పాటించాలని అన్నారు. ప్రతి మండలం లో ఇందిరమ్మ డెమోన్‌స్ట్రేషన్ ఇంటి నిర్మాణం పనులు ప్రారంభించాలని సూచించారు. ఈజిఎస్ ద్వారా చేసిన పనులకు చెల్లింపులు పూర్తి చేయాలని జి.పి.ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని అన్నారు. ఎంసిసి పనులు గ్రౌండ్ చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద చేపట్టిన పనులకు సంబంధించి స్ట్రూటినీ అధికారి ద్వారా పరిశీలించిన బిల్లులు జిల్లా విద్యా శాఖ అధికారికి పంపించాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. ఈ సమావేశం లో జడ్పీ సిఈఓ వెంకటరెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, ఆర్డీఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలి

## నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** జిల్లాలో గుర్తించిన ప్రాంతాలలో నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన డిఎల్ఎస్‌సి( డిస్టిక్ లెవెల్ స్యాండ్ కమిటీ) సమావేశం ఏర్పాటు చేశారు. మాగనూర్ మండలం అడవి సత్యవార్‌కు చెందిన నలుగురు రైతులు,వర్కూర్‌కు చెందిన మరోరైతు తమ పట్టా భూముల నుంచి ఇసుకను తొలగించాలని దరఖాస్తు చేసుకోగా సోమవారం నాటి సమావేశంలో ఆ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఇసుక తరలింపు విషయంలో మైనింగ్, రెవెన్యూ, భూగర్భ జలశాఖ, సర్వే ల్యాండ్, నీటి పారు దల, వ్యవసాయ శాఖల అధికారుల నివేదికలు, అభిప్రాయాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో మైనింగ్ ఏడి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులు ఇచ్చిన నివేదికలన్ని సరిగ్గా ఉన్నాయని, దరఖాస్తుదారుల పట్టా భూముల నుంచి ఇసుక తొలగించేందుకు అనుమతులు – మిగతా2లో..

# స్వేచ్ఛాయుతమైన వాతావరణం కల్పించాలి

## లోకల్ కంప్లైంట్ కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయేంద్ర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 30 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం కలెక్టర్ ఛాంబర్‌లో లోకల్ కంప్లైంట్ కమిటీ (ఎల్‌సిసి) సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ పని ప్రదేశంలో 2013 ప్రకారం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ మహిళలందరికీ కూడా వేధింపులు లేని మంచి స్వేచ్ఛాయుతమైన పని వాతావరణం కల్పించాలని, మండల స్థాయిలో మండల నోడల్ ఆఫీసర్స్ ని అపాయింట్ చేసి వారి ద్వారా ఫిర్యాదులను లోకల్ కంప్లైంట్ కమిటీకి గోప్యంగా అందచేయాలని సూచించారు మండలసమైక్యల ద్వారా మహిళలపై జరిగే దాడులను విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మహబూబ్నగర్ జిల్లాలో పని ప్రదేశంలో – మిగతా2లో..

# అమరచింత యూనియన్ బ్యాంక్ చోరీకి యత్నం

**బ్యాంకు లోపల సీసీ కెమెరాల దృశ్యాల భద్రపరిచే పరికరం ఎత్తుకెళ్లిన దుండగులు**

**ఖాతాదారులలో ఆందోళన, పట్టణంలో జాగిలాలతో గాలింపు**

**బ్యాంకులో డబ్బు, బంగారం సేఫ్**

**అమరచింత డిసెంబరు 30 ప్రభాతవార్త :** అమరచింత యూనియన్ బ్యాంకులో గుర్తు తెలియని వ్యక్తులు డబ్బు బంగారం భారీగా దొంగతనం జరిగిందని వాట్సాప్ లో ప్రచారం కావడంతో బ్యాంక్ ఖాతాదారులు సోమవారం అమరచింత యూనియన్ బ్యాంక్ ముందు వందలాదిమంది ఖాతాదారులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం బ్యాంక్ సిబ్బంది విధులు ముగించుకొని వెళ్లడంతో శని, ఆదివారం సెలవు ఉండడంతో సోమవారం విధులు నిర్వహించడానికి బ్యాంకు సిబ్బంది తాళం తెరిచి బ్యాంకు లోపలికి వెళ్లడంతో సీసీ కెమెరాలు పరికరం కనిపించకపోవడంతో బ్యాంక్ అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వర్లు ,ఆత్మకూరు సిఐ శివకుమార్ ,ఎస్సై సురేష్, చేరుకొని బ్యాంకు ఆవరణ చుట్టు పరిశీలించారు. వెంటనే క్లూస్ టీం డాగ్ స్క్వాడ్ టీమును రప్పించి పట్టణంలో డాగ్ స్క్వాడ్ గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ శివకుమార్ మాట్లాడుతూ, యూనియన్ బ్యాంక్ వెనక భాగాన కిటికీని తెరచి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేయడానికి లోపలికి వెళ్లారని బ్యాంకులో లాకర్లు ఓపెన్ కాకపోవడంతో





అమరచింత యూనియన్ బ్యాంక్ దగ్గర ఖాతాదారులు ఆందోళన ఇన్‌సెట్లో జాగిలాలతో గాలిస్తున్న డాగ్ స్క్వాడ్

దుండగులు బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను భద్రపరిచే పరికరాన్ని ఎత్తుకెళ్లారని ఆయన తెలిపారు. బ్యాంకులో డబ్బు బంగారం ఎలాంటిది దొంగతనం జరగలేదని బ్యాంక్ ఖాతాదారులు ఆందోళన చెందకుండా ఉండాలని ఆయన వారిని కోరారు. యూనియన్ బ్యాంక్ చోరీకి పాల్పడిన వారిని గుర్తించి పట్టుకుంటామని ఆయన తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షూ పంపిణీ

**బాలానగర్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** బాలానగర్ మండలం నేరళ్లపల్లి గ్రామంలో సోమవారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాతృమూర్తి శశికళ రెడ్డి ప్రాథమిక పాఠశాలలో 72 మంది విద్యార్థులకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 232 మంది విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శశికళరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి నిరుపేద విద్యార్థుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత చదువులు చదివి తమ తల్లి



విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న దృశ్యం

దండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్‌నాయక్, హరి సింగ్, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షులు భద్రూ నాయక్, నరేందర్ రెడ్డి, రఫీక్ తదితర కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

### ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 30 ప్రభాతవార్త :** భాధితుల సమస్యల పట్ల విచారణ చేపట్టి సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఎస్పీ కార్యాలయానికి వివిధ రకాల సమస్యలతో వచ్చిన 15 మంది భాదితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భాధితుల సమస్యల సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూర్చాలని


ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పి రావుల గిరిధర్

ఆదేశించారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసులవిచారణలో జాప్యంజరగకుండా వీలైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు.

## సమస్యల పరిష్కారానికై కలెక్టర్‌కి వినతి పత్రం

### అయిజ మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సంకాపురం రాముడు

**గద్వాల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** అయిజ మండలలోని వివిధ గ్రామాల రైతులు పలు సమస్యలపై ప్రజావాణిలో అయిజ మండల సింగిల్ విండో మాజీ అధ్య క్షులు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతి పత్రాలు అందజేశారు. ఆర్డీఎస్ పరిధిలో యాసంగి పంట పూర్తయ్య వరకు రైతులు సాగునీరు అందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని వరి కొనుగోలును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ భూమి కలిగి ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్న రైతులందరికీ రైతుబంధు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సింగల్ విండో చైర్మన్

వర్తింప చేయాలన్నారు. గద్వాల్ జిల్లా కోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణాలను పిజెపి క్యాంప్ కార్యాలయం ఆవరణలోనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించటం జరిగిందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని మిరప రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరానని రాముడు తెలిపారు. పైన ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అయిజ మండల సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రాముడన్న సైన్యం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతోనే ఒత్తిడి దూరం

**చిన్న చింతకుంట డిసెంబరు 30 ప్రభాతవార్త:** ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత తో పాటు మానసిక ఒత్తిడి దూరం చేయవచ్చని మండలంలోని హార్ట్ ఫుల్ నెస్ సంస్థ శిక్షకులు రాజు గౌడ్, పరమేశ్వరిలు తెలిపారు సోమవారం సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధ్యానం చేయడంతో చదువుల్లో ఏకాగ్రత సాధించి విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుంటారని వారు తెలిపారు పరీక్షల్లో మానసిక ఒత్తిడిదూరం చేయాలంటే ధ్యానం


ధ్యానంపై వివరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్నరాణి

ఒక్కటే మార్గమని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తూ ఒత్తిడిలేకుండా పరీక్షలను వ్రాయవచ్చని కళాశాలప్రిన్సిపల్ ప్రసన్నరాణి తెలిపారు. కార్యక్రమంలో శశికుమార్, కృష్ణవేణి, అనసూయ, రాజేష్, రేష్మ, శివకుమార్ పాల్గొన్నారు.

## వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల నమూనా పనులు

**ఉప్పునుంతల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు నిర్మించేందుకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు నమూనా ప్రక్రియ పూర్తి చేసేందుకు ఇటీవల అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ మండల కేంద్రమైన ఉప్పునుంతలలో భూమి పూజ చేశారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల రైతు వేదిక సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నమూనా భవన పనులు వేగవంతంగా కొనసా


ఇందిరమ్మ ఇళ్ల నమూనా భవన స్లాబ్ పనులకు శ్రీకారం

గుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల హౌసింగ్ డిఇ ఆనంద్ రెడ్డి, ఎఇ రాజవర్ధన్‌రెడ్డిలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్లాబ్ పనులకు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈఇ ఆనంద్ రెడ్డితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రత్లావత్ కృష్ణ, కట్ట శ్రీనివాసు రెడ్డి, రతన్ సింగ్, మేకల కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెల్టూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి

### డిసిసి ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్‌రెడ్డి

**ఉప్పునుంతల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** మండలంలో అతిపెద్ద గ్రామమైన వెల్టూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలానికి సుదూరప్రాంతాలైన పెనిమిళ్ళ, లత్తీపూర్, గువ్వలోనిపల్లి, పిరట్వాన్‌పల్లి, అయ్యవారిపల్లి, వెల్టూరు, ఈరట్వాన్ పల్లి, సూర్య తాండ తదితర గ్రామాలకు దూరంకావడంతో వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అచ్చంపేట నియోజకవర్గ ప్రతినిధి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ప్రత్యేక దృష్టి సారించి వెల్దుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

## పాతపల్లిలో ఘనంగా అమావాస్య పూజలు

**పెబ్బేరు డిసెంబరు 30 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామంలో చింతలకుంట ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, ప్రసాదం, మంగళ హారతి మొదలై మధ్యాహ్నం సుగురు మాజీ సర్పంచ్ పెద్ది వెంకటస్వామి వారి కుటుంబ సభ్యులతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ అమావాస్య ప్రత్యేక పూజలో భక్తు


అమావాస్య ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులు

లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు వెంకటస్వామి, శ్రీనివాసులు భక్తులు బల్వరి ఈశ్వరయ్య, బల్వరి సుధాకర్, ప్రదీప్, బుచ్చిబాబు, సితార టైలర్, మహేష్, శేఖర్, అంజి పాత పల్లి గ్రామస్తులు భక్తుల పాల్గొని విజయవంతం చేశారు.

# 21వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన దీక్షలు

**గద్వాల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** సమ్మెలో భాగంగా స్మృతి వనం దగ్గర చేపట్టిన నిరవధిక రిలే నిరసన దీక్షలు సోమవారం నాటికి 21 వ రోజుకు చేరాయి. జోగులాంబ గద్వాల జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ యొక్క సమ్మెను కొనసాగిస్తూ పెద్ద ఎత్తున సమగ్ర శిక్ష ఉద్యోగులు అందరు పాల్గొని తమ యొక్క డిమాండ్స్ నెరవేరాలని, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగులందరీని రెగ్యులర్ చేయాలని దీక్షలు చేస్తున్నారు. అప్పటివరకు పే స్కేల్ అమలు చేయాలని నిరసన తెలుపుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల యొక్క డిమాండ్స్ న్యాయమైనవని కంపల్సరీ నెరవేరాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలపడం జరిగింది. అందులో కొన్ని పాఠశాలల పేర్లు అప్స్ యూపిఎస్ భీమవరం, పీఎస్ క్యాతూరు, యూపిఎస్ కోనేరు, పీఎస్ అల్లంపూర్, పీఎస్ సింగవరం-॥, పీఎస్ హరిజనవాడ, పీఎస్ ర్యాలంపాడు, పీఎస్ న్యూ ప్లాట్స్ అలంపూర్ మొదలైన ఉపాధ్యాయులు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలపడం జరిగింది. పిఆర్‌టియుటిఎస్ నుండి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మీలో మేధావులు ఉన్నారు, మీరు అనుకుంటే ఏ పరీక్షనైనా అలవకగా ప్రభుత్వ ఉద్యోగం సాధించగలరు అలాంటి మీరు ఇక్కడ కూర్చోవడం చాలా బాధాకరం, కానీ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరుకుంటున్న, మీ ప్రయత్నం మీరు ఆపకుండా పోరాడండి, ప్రభు



దీక్ష చేస్తున్న ఎస్ఎస్ఎస్ ఉద్యోగులు

త్వం స్పందించే వరకు మీరు సమ్మెను కొనసాగించండి మీ వెంట నేనుంటాను అది రెండు నెలలైనా సరే మూడు నెలలైనా సరే అని అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ నుంచి నరేష్ మాట్లాడుతూ మా పార్టీ తరుపున సంపూర్ణ మద్దతును తెలుపుతున్నాం అన్నారు. ఉద్యోగ వ్యవస్థలో అతి తక్కువ వేతనంతో ఉద్యోగాలు చేస్తున్న మీకు మా సంఘీభావం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని మనమేమి తీర్చలేని కోరికలు కోరాట్లేదని, మన ఉద్యోగ క్రమబద్ధీకరణ మాత్రమే అడుగుతున్నాం అన్నారు. మిమ్మల్ని చూస్తుంటే సకల జనుల సమ్మెనే గుర్తొస్తుందన్నారు. పేద పిల్లలు సర్కారు బడుల్లో చదువుతున్నారు. మరి వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలవాలని కోరారు. అదేవిధంగా గట్టు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గుంటీ గోపిలత గద్వాల్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి, కేటీ .దొడ్డి స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, కేజీబీవీ ధరూర్ స్పెషల్ ఆఫీసర్ వి.టీ గోమతి, ఐజా కేజీబీవీ చెన్న బస్సమ్మ, మల్దకల్ కేజీబీవీ స్పెషలాఫీసర్ విజయలక్ష్మి, వడ్డేపల్లి కేజీబీవీ స్పెషలాఫీసర్ పద్మ, రాజోలి కేజీబీవీ స్పెషలాఫీసర్ చంద్రకళ, ఉండవెల్లి స్పెషల్ ఆఫీసర్ పరిమళ, అల్లంపూర్ కేజీబీవీ స్పెషలాఫీసర్ కృష్ణవేణి, మానపాడు కేజీబీవీ స్పెషలాఫీసర్ అనురాధ, ఇటిక్యాల కేజీబీవీ స్పెషలాఫీసర్ ఆసియా బేగం, యూఆర్ఎస్, స్పెషల్ ఆఫీసర్ శేషన్న, సి.ఆర్.టి.లు పీజీసీఆర్టీలు, నాన్ టీచింగ్ స్టాఫ్ కొందరు ఈ సమ్మెలో పాల్గొనడం జరిగింది. డీపీఓ వింగ్ అధ్యక్షుడు డిఎల్ఎంటి, బి రామాంజనేయులు, మిస్ వింగ్ అధ్యక్షుడు శ్రీధర్, సీసీఓ వింగు అధ్యక్షుడు ఆల్తాఫ్, సీఆర్పీ వింగ్ అధ్యక్షుడు ఎంప సమీ, ఐఆర్పి వింగ్ అధ్యక్షుడు మురళి, పి టిఐ వింగ్ అధ్యక్షుడు రాజేందర్ రోజువారిగా వీరు పాల్గొంటున్నారు. అదేవిధంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు హుషనప్ప, జేఏసీ ప్రధాన కార్యదర్శి గోపాల్, కెజిబివి మహిళా అధ్యక్షురాలు ఎస్పీ. ప్రణిత సమగ్ర శిక్ష లోని అన్ని వింగుల అధ్యక్షులు పాల్గొని సోమవారం నిరవధిక సమ్మెను విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొనడం జరిగింది. ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి గా హామీ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చెయ్యాలి అప్పటి వరకు పే స్కేల్ అమలు కల్పించాలి.

## శ్రమజీవుల దోపిడీకి వ్యతిరేకంగా సిపిఐ వందేళ్ళ పోరాటం

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ రాములు

**వనపర్తి టౌన్ డిసెంబరు 30 ప్రభాతవార్త:** దేశంలో శ్రమజీవుల దోపిడీకి వ్యతిరేకంగా వందేళ్లుగా సిపిఐ పోరాడుతూ వస్తోందని, ఎర్రజెండా నీడన చేరి పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు పిలుపునిచ్చారు. 100వఆవిర్భావ దినం సందర్భంగా నల్లగొండలో జరుగుతున్న భారీ బహిరంగ సభకు వెళుతున్న వాహనాలను సోమవారం వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కార్మికరాజ్యం, సమసమాజ స్థాపన, దోపిడీ లేనిసమాజం నిర్మాణం కోసం సిపిఐ1925 డిసెంబర్26న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్లో పురుడు పోసుకున్న సిపిఐ 2024 డిసెంబర్ 26 నాటికి శత జయంతి జరుపుకుందన్నారు. ఈనేపథ్యంలో నల్గొండ జిల్లాలో 100వ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారని, జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి



సభకు వెళ్తున్న వాహనాలను
జెండా ఊపి ప్రారంభించిన సిపిఐ నాయకులు

వెళ్తున్నారన్నారు. దేశ స్వాతంత్రం కోసం ఆంగ్లేయులపై పోరాడిందని, సంపూర్ణ స్వాతంత్రం కావాలని పిలుపునిచ్చిన తొలి పార్టీ సిపిఐ అన్నారు. స్వాతంత్ర పోరాటంలో సిపిఐ అత్యంత కీలక పాత్ర పోషించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందన్నారు. పోరాటంలో 4500 మంది అమరులయ్యారన్నారు. స్వాతంత్రానంతరం దేశంలో కార్మికుల శ్రమదోపిడి, భూస్వాములు, దొరల దౌర్జన్యానికి వ్యతిరేకంగా పేదలకు భూములు, ఇళ్ల స్థలాల పంపిణీ, రైతుకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనం, మహిళలకు హక్కుల కోసం పనిచేస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి ఏకైక మార్గం పోరాటమేనని, సిపిఐ పోరాట జెండా కింద ఏకమై హక్కుల కోసం ప్రజలు పోరాడాలని అన్నారు. నల్గొండలో జరిగే భారీ బహిరంగ సభ సిపిఐ భవిష్యత్తు పోరాటాలకు దిశా నిర్దేశం చేస్తుందన్నారు. వనపర్తి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు భారీగా బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు కళావతమ్మ, రమేష్ గోపాలకృష్ణ, శ్రీహరి, రాబర్ట్, మోష, సీఎన్ శెట్టి, శివ, జె చంద్రయ్య కృష్ణవేణి, గీత, భాస్కర్, మహేష్, బాలరాజు, చిన్న కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా నేడు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు

### సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం: జిల్లా ఎస్పీ.రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 30 ప్రభాతవార్త :** జిల్లా ప్రజలు సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ జిల్లా ప్రజలకు ఒక ప్రకటనలో సూచించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ జిల్లా పరిధిలోని ప్రజలు ప్రశాంతమైన వాతవరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీస శాఖ తరుపున భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. నేడు జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణా ప్రాంతాల్లోను ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా నిబంధనలకు విరుద్ధంగా డిజే లు, అధిక శబ్దం వచ్చే బాక్స్ లు ఏర్పాటు చేస్తే


ఎస్పి రావుల గిరిధర్ ( ఫైల్ ఫోటో )

ఉపేక్షించేది లేదని తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ, జిల్లా ప్రజలందరికీ పోలీసు శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

## పిడిఎస్‌యు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పవన్ కుమార్

**వనపర్తి క్రైమ్ డిసెంబర్ 30 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రగతి శీల ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం(పిఎస్‌యు) జనరల్ కౌన్సిల్ స్థానిక వనపర్తి జిల్లా కేంద్రంలో ఆదివారం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిల్ సమావేశం కు ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ప్రతినిధుల సమక్షంలో ఉమ్మడి జిల్లా ఉద్యమాన్ని సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణ కోసం జిల్లా నూతన కార్యవర్గం 9 మంది తో ఎన్నిక జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గా కందుకూరి పవన్ కుమార్ ప్రధానకార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా తాయ్యన్న, కోశాధికారి. గణేష్ సభ్యులు పేర్లు, అశోక్, అనిల్, నారాయణ రెడ్డి, రాజు, రాకేష్ లను ఎన్ను కున్నారు. ఉమ్మడి జిల్లాలో సంఘం సంస్థ గత కార్యక్రమాలు పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ రెడ్డి ప్రకటించారు. అనంతరం పవన్ కుమార్ మాట్లాడుతూ 5 దశాబ్దాల ఉద్యమ



చరిత్ర కలిగిన విప్లవ విద్యార్థి సంఘం కు అధ్యక్షులు గా కావడం సంతోషంగా ఉందని, శాస్త్రీయ విద్యా సాదన లక్ష్యంగా సమసమాజం స్థాపన ధ్యేయంగా అందరికి సమాన విద్యా అందించాలనే ఉద్దేశంతో పని చేస్తున్న ఈ సంఘం బలోపేతం కు మరింత కృషి చేస్తానని ఉమ్మడి జిల్లా లో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయడం కోసం సమర శీల పోరాటాలు నిర్వహిస్తానని రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, జిల్లాలో విద్యారంగం అభివృద్ధి కి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానించిన

## కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

### డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు వామపక్షాలు నిరసన

**అమరచింత డిసెంబరు 30 ప్రభాతవార్త:** పార్లమెంటు సమావేశాలలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమానించిన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి జిఎస్ గోపి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కె రాజన్న సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం అన్నారు. వామపక్షాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం అమరచింత మండల కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు సిపిఎం, సిపిఐ, ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగంపై ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్‌ను అవహేళన చేయడం సిగ్గుచేటని వారు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రతో కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వారు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కేంద్ర హోం శాఖ మంత్రిని బర్తరఫ్‌చేయాలని లేనిచో దేశవ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి వెంకటేష్, అజయ్, శ్యాంసుందర్, సామెల్, కురుమన్న, సత్యనారాయణ, రాఘవేంద్ర, చంటి, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు వామపక్షాలు నిరసన

## ఉపాధి కల్పిస్తున్న గోదాములను రక్షించాలి

**గద్వాల, డిసెంబరు 30 ప్రభాతవార్త:** గద్వాల మండలంలోని పూడూరు గ్రామ శివారులో ఉన్నటువంటి గోదాములలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 2000మందికి ఉపాధి కల్పిస్తుందని అట్లాంటి వాటిని ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవడమే కాక స్థానిక హమాలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సోమవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ల రంజిత్ కుమార్ అడిషనల్ కలెక్టర్(రెవిన్యూ) లక్ష్మీనారాయణని కలిసి వినతి పత్రం ఇచ్చారు. గతంలో చుట్టుపక్కల గ్రామాలలో డబ్బులు వసూలు చేసి ఉపాధి కల్పిస్తామన్న యాజమాన్యం వేరొకరికి విక్రయించాక స్థానిక రాజకీయ కారణాలతో సమస్యలు సృష్టిస్తే ఏడు సంవత్సరాల తర్వాత చట్టపరంగా అన్నిటిని దాటుకొని ప్రారంభమైన తర్వాత స్థానికంగా ఉన్నటువంటి హమాలీలు, లారీ


జెసికి వినతిపత్రం ఇస్తున్న రంజిత్ కుమార్

డ్రైవర్, క్లీనర్లు ఉపాధి దొరికిందన్న సంతోషంలో ఉండగా మళ్లీఅడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, జిల్లాలోనే అత్యధికంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధికల్పిస్తున్న గోదాములలో స్థానికులకు ఉపాధిఅవకాశాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో కన్వీనర్ బుచ్చిబాబు నడిగడ్డ హక్కులపోరాటసమితి నాయకులుశ్రీనివాస్ యాదవ్, రంగస్వామి, ప్రేమ్‌రాజ్, గోపాల్ పాల్గొన్నారు.

## నేడు మాజీ న్యాయ మూర్తి రాక

**గద్వాల, డిసెంబరు 30 ప్రభాతవార్త :** ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టి స్ డా. షమీమ్ అఖ్తర్ నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చేసి ఎస్సీ కులాల వర్గీకరణపై అధ్యయనం చేయనున్నారని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాలజిల్లాలోని అన్ని ఎస్సి కులసంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కులసంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ నేడు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హాజరై కుల వర్గీకరణ అధ్యయనంపై తమ విజ్ఞాపనలను రాత పూర్వకంగా సమర్పించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## చెక్కును అందజేసిన సింగిల్‌విండో

**మద్దూర్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మద్దూరు మండల పరిధిలోని హనుమాన్ నాయక్ తండాల్లో నిగడ్డ తాండకు చెంది న రుక్కు భాయ్‌కి రూ.50 వేల చెక్కును మద్దూర్ సింగిల్ విండో చైర్మన్ నర్సింలు సోమవారం అంద జేశారు. కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి సహకారంతోనే చెక్కు రావడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

## ఇండ్ల సర్వేను పరిశీలించిన డిఆర్డిఓ

**మద్దూర్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** మద్దూర్ పట్టణ కేంద్రంలో సోమవారం డిఆర్డిఓ మొగులప్ప కావలి గిరిలో పరిశీలించారు త్వరగా సర్వేను పూర్తిచేయాలని సర్వే చేస్తున్న అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారెడ్డి. ఏపిఎం మరియు విఏఓ వెంకట్ రాములుగౌడ్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో మూడో స్థానంలో ముడుమాల విద్యార్థి

**కృష్ణ, డిసెంబరు 30 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సీఎం కప్ పోటీలలో భాగంగా, హైదరాబాద్ తుక్కుగూడలో నిర్వహించిన, సైక్లింగ్ పోటీల విభాగంలో రాష్ట్రస్థాయిలో కృష్ణ మండలం, ముడుమాల విద్యార్థి, కటికల్ పరుశరాములు మూడవస్థానం పొందాడు. ఈసందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలి

**ఉప్పునుంతల, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మండలంలోని ఆ గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల వేతనాలను వెంటనే పెంచాలని సిఐటియు మండల కార్యదర్శి చింతల నాగరాజు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మోహన్‌లాల్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన అన్నారు. వేతన బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రమాదేవి రామచంద్రయ్య, పద్మ, చిన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకే ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలి

మొదటి పేజీ తరువాయి

ఇవ్వవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నిశాఖల అధికారులు రిపోర్టుల ఆధారంగా అనుమతికి కలెక్టర్ అంగీకారం తెలిపారు. అయితే టీజీఎండీసి ద్వారా ఆయా భూములలో ఉన్న ఇసుకను తరలించేందుకు ఎన్ని వాహనాలు అవసరమవుతాయని, ఎన్ని రోజుల సమయం పడుతుందని అధికారులతో చర్చించారు. తీసుకొని తరలించే ప్రాంతాలలో సీసీ కెమెరాలు, వాహనాలకు జిపిఎస్ ఏర్పాటుచేయాలని కలెక్టర్ సూచించారు. అయితే రెవెన్యూ, నీటిపారుదల శాఖ, పంచాయతీ కార్యదర్శు లతో కలిపి ఒక టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేసి ఇసుక తర లింపుపై పర్యవేక్షణ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. సమా వేశంలో ఆర్డీవో రామచందర్ నాయక్, డిఎస్‌పి నల్లపు లింగ య్య భూగర్భ జల వనరుల శాఖ అధికారిని రమాదేవి, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, ఆర్టీవో మేఘా గాంధీ, నీటిపారు దల శాఖ జిల్లా అధికారి బాలరాజ్, డిఈఈ సురేష్, టీజీఎం డిసి అధికారి రంగారెడ్డి, మక్తల్, మాగనూరు తహాసిల్దార్లు, ఎస్ఐలు కలెక్టరేట్ లోని సంబంధిత సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛాయుతమైన వాతావరణం కల్పించాలి

మొదటి పేజీ తరువాయి

మహిళలపై వేధింపులకు సంబంధించి 2013వ సంవత్సరం పని ప్రదేశంలో మహిళలపై వేధింపులు నివారణ పరిష్కారం చట్టం 2013 ప్రకారం అన్ని పని ప్రదేశాలు ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాలలో సంఘటిత అసంఘటిత రంగాలలో పది మంది కన్నా ఎక్కువ సిబ్బంది ఉన్నట్లయితే ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు అదేవిధంగా పదిమందికన్నా ఎక్కువ ఉద్యోగులు ఉన్నట్లయితే ఐసీసీ ఏర్పాటు లేనట్లయితే వారి ఫిర్యాదును రూమ్ నెంబర్ 36లోని జిల్లా సంక్షేమ అధికారి గారికి అందించవచ్చు లేదా లోకల్ కంప్లైంట్ కమిటీకి (ఎల్‌సిసి) అందజేయవచ్చును లేదా 181 అనే టోల్ ఫ్రీ నెంబర్ 24గంటలు అందుబాటులో ఉంటుంది దానికి కూడా మీరు మీ ఫిర్యాదును అందజేయవచ్చని అన్నారు ఒక కంప్లైంట్ బాక్స్‌ను కూడా ఏర్పాటు చేయాలి 10 మంది కన్నా తక్కువ ఉన్నట్టయితే కలెక్టరేట్లోని లోకల్ కంప్లైంట్ కమిటీ జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చు లేదా 181 టోల్ ఫ్రీ నెంబర్ టి షీ బాక్స్ ఆన్లైన్ పోర్టల్ కలెక్టరేట్లోని రూమ్ నెంబర్ 36 డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీస్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు ఈ కమిటీ సమావేశంలో అడిషనల్ డిఆర్డిఓ ముసాయిదా, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం మాస్ మీడియా అధికారిణి మంజుల, డిఆర్‌డిఓ, డిపిఎం నాగమల్లిక, ఎంవిఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి, ఎన్జీవో గోవర్ధని, డివి సెల్ లీగల్ కౌన్సిలర్ అరుణ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి

**● బాధితులకు న్యాయం చేయాలి : డిఎస్పీ ఎన్ లింగయ్య**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ

**నారాయణపేట టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** గ్రీవెన్స్ డే సందర్భంగా వచ్చినటువంటి ఫిర్యాదులను బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని డీఎస్పీ ఎన్. లింగయ్య అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజలసౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డేలో భాగంగా నారాయణపేట సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీ నల్లపు లింగయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 04 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసు కొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితు లకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యం గా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగాస్పందించి బాధితులకు న్యాయం అందే విధంగా చూడడం జరుగుతోందని డీఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్‌కి,పై ఆఫీసులకి వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులని తీసుకురావద్దని బాధితులు మాత్రమే నేరుగా వచ్చి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలని డీఎస్పీ తెలిపారు.

## అమిత్‌షాను కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలి



ఉప్పునుంతలలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

**ఉప్పునుంతల, డిసెంబరు 30 ప్రభాతవార్త:** కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను వెంటనే కేంద్ర మంత్రి వర్గం నుంచి భర్త రాఫ్ చేయాలని సిపిఎం మండల డివిజన్ నాయకులు ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాతపై భారత పార్లమెంటు రాజ్యసభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన హోం శాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే భారత దేశంలోని ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని సిపిఎం మండల నాయకుడు చింతల నాగరాజు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మాదర్ల కిష్టయ్య, వెంకటయ్య, చిన్నరని, హమాలి సంఘం సభ్యులు అంజి, వెంకటేష్, ఖలీల్, సాయిబాబు, సైదులు, శివ, జంగయ్య పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



వినతి పత్రం సమర్పిస్తున్న ఆశాలు

**మక్తల్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో విశేషమైన కృషి చేస్తున్న ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కో కన్వీనర్ గోవిందరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తిరుపతికి వినతి పత్రం అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం గత 15 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు జాత మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే బహిరంగ సభతో ముగుస్తుందని, జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఆశా కార్యకర్తలు ఈ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు గోవిందమ్మ, ప్రధాన కార్యదర్శి యశోద, కోశాధికారి అమీనా బేగం, ఉపాధ్యక్షురాలు ఇందిరమ్మ, స్వప్న, సావిత్రమ్మ, సుజాత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

**పెబ్బేరు డిసెంబరు 30 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంను పరిశీలించి ఇల్లు లేని ప్రతి పేదవాడికి మన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి ఎస్సీ,ఎస్టీలకు 6 లక్షల రూపాయలు, బీసీలకు 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయబడుతుంది. అయ్యవారిపల్లి గ్రామంలో ఇల్లు లేని పేదవారిని గుర్తించి వారికి మన ఎమ్మెల్యే మేగారెడ్డి ద్వారా అయ్యవారిపల్లి గ్రామానికి ఎక్కువ ఇళ్లను మంజూరు చేయించి ప్రతి ఒక్క పేద కుటుంబానికి ఇల్లు కట్టుకోవడానికి నిధులు మంజూరు చేయించుటకు మన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు లక్ష్మణ్ నాయుడు ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులను కొన్ని రోజులుగా అయ్యవారిపల్లి గ్రామంలో ఇల్లు లేని కుటుంబాలను గుర్తించమని కమిటీ సభ్యులకు తెలిపి వారికి మంజూరు చేయించేందుకు కమిటీ వారిని గ్రామంలో సర్వే జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేశపాగా బాలరాజ్, ఎండి నిరంజన్, బాలరాజు,భాస్కర్, నవీన్,గుంటివెంకటేష్ మరియు గ్రామపంచాయతీ సెక్రెటరీ, స్పెషల్ ఆఫీసర్ తదితరులు ,నాయకులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నివారణపై శిక్షణ



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీ టీచర్స్

**గద్వాలడిసెంబరు 30 ప్రభాతవార్త:** మాదకద్రవ్యాల,మద్యపానం దుర్వినియోగం, నివారణ అనే అంశాలపై ఎస్ ఎల్ సి ఏ కోఆర్డినేటర్ శ్రీపాద సుధాకర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా సంక్షేమ అధికారి డి.సునంద ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఐడిఓసిలోని జిల్లా కాన్ఫరెన్స్ హాల్ నందు రాష్ట్ర స్థాయి కోఆర్డినేటింగ్ ఏజెన్సీ న్యూ హోప్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమెతెలిపారు. యువతలో మత్తుపదార్థాల వాడకం ఎక్కువైందని, దీన్ని తగ్గించడానికి మాస్టర్ వాలంటీర్లు(నషాముక్త భారత అభియాన్ కార్యక్రమంలో భాగంగా) స్వచ్ఛందంగా పనిచేయాలని అన్నారు. మత్తుకు బానిసలు అయిన వారిని డి అడిక్షన్ కేంద్రాల్లో చేర్పించాలని ఆమెఈ సందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో సిడిపిఓ లు వెంకటేశ్వరి, సుజాత కమ్యూనిటీ ఎడ్యుకేటర్ కృష్ణయ్య, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాలతోనే సమస్యలను సాధిస్తాం

### వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి విజయ రాములు



**అమరచింత డిసెంబరు 30 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలతోనే సమస్యలను సాధిస్తామని సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి, విజయ రాములు అన్నారు. సోమవారం నల్గొండలో జరిగే సిపిఐ శతా జయంతి బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లయిన సందర్భంగా ప్రజలకు విప్లవ అభివందనాలు తెలిపారు. భారత్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూమిలేని పేదలకు పదివేల గ్రామాలలో 10 లక్షల ఎకరాలు పంచిన ఘనత సిపిఐ పార్టీకి ఉందని ఆయన గుర్తు చేశారు. దేశంలో పేదల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీలను కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ అణిచి వేయడానికి కుట్ర పన్నుతుందని ఆయన అన్నారు. దేశంలో దేవుడు పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. ఎన్నికల్లో ఏడాదికి కోటి ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన కేంద్రం ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలతో కలిసి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, కుతుబ్,శంకర్, భాస్కర్,అబ్రహం,కథలప్ప తదితరులు ఉన్నారు.

## వీరభద్ర స్వామి దేవాలయంలో అన్నదాన కార్యక్రమం

**ఖిల్లాఘణపురం డిసెంబరు 30 ప్రభాతవార్త:** అమావాస్య సందర్భంగా శ్రీ ఘనలింగేశ్వర వీరభద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించడం జరిగిందని కమ్మరి గోపి తెలిపాడు. ప్రతి నెల అమావాస్య సందర్భంగా దాతల సహకారంతో ఇక్కడ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారని 103వ సారి అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించామని ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారని ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ,యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నట్లు చెప్పారు.

### నూతన సంవత్సరం వేడుకలపై

# పోలీసు వారి సూచనలు తప్పకుండా పాటించాలి

**■ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



నూతన సంవత్సర నిబంధనలు, సూచనలను తెలియజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

**గద్వాల డిసెంబరు 30 ప్రభాతవార్త:** జోగుళాంబ గద్వాల్ జిల్లా పరిధిలో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను పోలీస్ వారి సూచనలను పాటిస్తూ ఇతరులకు ఇబ్బందులు కల్పించకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు ప్రజ లకు సూచించారు. జిల్లాలో నూతన సంవత్సరము వేడుకలను పురస్కరించుకొని ట్రాఫిక్, లాఅండ్ ఆర్డర్ పోలీసులు ముందు జాగ్రత్తచర్యలో భాగంగా అప్రమత్తమై పక్క కార్యాచరణతో విధులలో ఉంటారని, నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఏవరైన అతిక్రమించినా వారిపైకఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చ రించారు. ఎక్కడ కూడా పోలీస్ అనుమతిలేకుండా ప్రజలను భయాందోలనకు గురిఅయ్యే విధంగా క్రాకర్స్,ఆర్.కె స్టా" సౌండ్సిస్టమ్, లేదా అత్యధిక మొతాదులో గల సౌండ్ సిస్టమ్ (డి.జె) ఏర్పాట్లు నిషేధించడం జరిగిందని, వృద్ధులు లేదా అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందనీ అన్నారు.

**ట్రాఫిక్ నిబంధనలు:** జిల్లా పరిధిలోని గద్వాల్ పట్టణ, ఐజ, శాంతి నగర్, అలంపూర్, ఎర్రవల్లి పట్టణలతో పాటు మండల కేంద్రాలలో పోలీస్ అధికారులు సిబ్బంది విధులలో ఉంటారని, అలాగే గ్రామీణ ప్రాంతాలలోరాత్రంతా బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ గస్తీ నిర్వహించడం జరుగుతుందని, ఈ వేడుకల సందర్భంగా ప్రతీ వాహనాదారుడు తూచతప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.యువత ఆనందం వేడుకల పేరుతో మద్యం సేవించి మత్తులో రోడ్లపై వేగంగా ఇష్టారాజ్యాంగా వాహనాలునడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రుల పై కేసులు నమోదు అవుతాయని సూచించారు. జిల్లా లోని ప్రధాన పట్టణాల కూడళ్లలో ట్రాఫిక్ నియమాలుఅమలు తీరును మరింత పటిష్టంగా అమలు పరచడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా ప్రధాన జంక్షన్లలో డ్రంకన్ డ్రైవ్, రోడ్లపై గస్తీ నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

**స్పెషల్ పార్టీలు:** నేడు అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో సాయంత్రం 6 గంటల నుండి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పా టు చేసి వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టనున్నామని. డ్రంక్ అండ్ డ్రైవ్ సందర్భం గా ఫోటో గ్రాఫి, వీడియో గ్రాఫీలు తీసిన తర్వాత వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని, పోలీస్ వారి నిబంధనలు ఎవ్వరయిన అతిక్రమించిన వారిపై చట్ట రీత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

**పోలీస్ వారి సూచనలు:** 1) బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం నిషేదం 2) మైనర్లు, యువకులకు బైకులు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కావున తల్లిదండ్రులు మైనర్ యువకులకు బైకులు ఇవ్వవద్దు. పట్టుబడితే కేసులు నమోదు చేయడం జరుగుతుంది. 3) ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వాహనాలు సీజ్ చేయనున్నారు. 4) అధిక వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం వుంది. 5)మద్యం తాగి వాహనాలు నడపొద్దు. జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ,స్పెషల్ తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తాము.6) గుంపులు గుంపులుగా రోడ్లపై కేకలు వేస్తే తిరగడం, వాహనాలతో ర్యాలీగా వెళ్లడం చేయరాదు. పై ఆంక్షలను ఎవరైనా అతిక్రమించిన ప్రజల దృష్టికి వస్తే డయల్ 100 కు సమచారం అందించాలని తద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠినచర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలు ప్రజలుతమ ఇండ్లలో కుటుంబ సభ్యులతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అదేవిధంగా 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశీస్తూ జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరుపున నూతన సంవ త్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

## వనపర్తిలో బేడ బుడగ జంగాల జెండా ఆవిష్కరణ



బేడ బుడగ జంగాల హక్కుల జెండాను ఆవిష్కరిస్తున్న కడమంచి శేఖర్

**వనపర్తి టౌన్ డిసెంబరు 30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పట్టణంలో బిజెహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సిరిగిరి మన్యం జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నరసింహ వనపర్తి జిల్లా అధ్యక్షుడు విభూతి నారాయణ ఆదేశాల మేరకు సోమవారం వనపర్తి జిల్లా పట్టణ కేంద్రంలోని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి 23వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షుడు కడమంచి శేఖర్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి గగనం సతీష్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 77సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వ పాలకులు బేడ బుడగ జంగం జాతిని విద్యా ఉద్యోగ రాజకీయ అన్ని రంగాల్లో అనగదొక్కాయనీ పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు బేడబుడగ జంగాలకు అందించాలని డిమాండ్ చేశారు. బేడ బుడగ జంగం జాతి మేల్కొని ఉద్యమ పోరాటంతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో ఉన్న మన హక్కులను మన వాటను దక్కించుకోవాలన్నారు. బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి దేశవ్యాప్తంగా జాతిని బలోపేతం చేసుకున్నామని ఐక్యమత్యంతో ముందుకు సాగి అన్ని రంగాల్లో జాతిని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.ఎస్సీ ఏబిసిడి వర్గీకరణతో బేడ బుడగ జంగాలకు 7వాటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విభూతి నారాయణ, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు కొండపల్లి తిరుపతయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ కడమంచి ఆనంద్, రాష్ట్ర ఉద్యోగ యూనియన్ నాయకులు తూర్పాటి సురేష్ ,జిల్లాకార్యదర్శి సిరివాటి మురళి,జిల్లా నాయకులు విభూతి చంద్రయ్య,అశ్వ,వెంకటేష్,కడమంచి చంద్రమౌళి, కడమంచి శివ ,యూత్ నాయకులు కొండపల్లి నీలకంఠం ,కొండపల్లి రాజు ,గగనం ,శంకర్ ,ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్యం, జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నరసింహ పాల్గొన్నారు.

## తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తాం

### టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు



పెబ్బేరు తెలుగుదేశం కార్యకర్తలను సన్మానిస్తున్న బక్కని నర్సింహులు

**పెబ్బేరు డిసెంబరు 30 ప్రభాతవార్త :** తెలంగాణ తెలుగుదేశం పార్టీ సభ్యత్వంలో చివరి రోజు సందర్భంగా పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు పెబ్బేర్ పట్టణంలో పాల్గొని పత్రికా మిత్రుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా 1,87 వేల సభ్యత్వాలు పూర్తయ్యాయని. పెబ్బేరు పట్టణంలో 487 సభ్యత్వాలు తీసుకున్నారని ఎస్సీ,ఎస్టీ, బీసీ బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం అని తెలంగాణలో అధికారంలోకి రావాలని ఉత్సవంతో సభ్యత్వాలు తీసుకొని తద్వారా పార్టీని బలోపేతం చేయాలని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ భాగ్యస్వామ్య పక్షాలు కలిసి విజయం సాధిస్తాయని వారు తెలియజేశారు.తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అభిమానులు సానుభూతిపరులకు పార్టీని స్థాపించినప్పటి నుండి మన ఓటు తెలుగు దేశం సైకిల్ గుర్తుకే మన తెలుగుదేశం అనే నాదంతో మన వనపర్తి నియోజకవర్గం మొత్తంనడిచి తిరిగినఅనుభవంతో పార్టీ పూర్వ వైభమే కార్యాచరణగా అనునిత్యం శ్రమిస్తూ నిబద్ధతగల కార్యకర్తలని అన్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశంనాయకులు శ్రీవారి సేవకులు సితార వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి రామన్ గౌడ్, వాకిటి బాలరాజు, శ్రీహరి, శ్రీహరి టైలర్, బలపాల సుధాకర్ పాల్గొన్నారు.

## యువతకు క్రికెట్ కిట్ అందజేత

**ఇటిక్యాల, డిసెంబరు30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కోదండపురం గ్రామంలోని యువతకు ఏఐసిసి కార్యదర్శి, అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆదేశాల మేరకు ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాలలోని యువత క్రీడలపై ఆసక్తిని పెంచుకొని జట్టుగా క్రికెట్ పోటీలలో పాల్గొని రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్‌యువతను కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహనాయుడు, పుల్లారెడ్డి, తిరుపతి, శంకర్, ఆంజనేయులు, సత్య పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలి

**పెబ్బేరు డిసెంబరు 30 ప్రభాతవార్త:** డిసెంబర్ 31 కు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సిఐ రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పెబ్బేరు మండల కేంద్రంలో పాటు వివిధ గ్రామాల ప్రజలు న్యూ ఇయర్ వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని యువతకు ప్రజలకు తెలిపారు. నేడు పోలీసుల నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనదారులు రాత్రి 12 తర్వాత మద్యం సేవించి వాహనాలపై తిరగడం, డిజేలు నిర్వహించడం నిషేధమన్నారు.బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదని డ్రంక్అండ్ డ్రైవ్‌లో పట్టుబడి ఎడల కేసులు నమోదు చేసి జైలుకు పంపడంజరుగుతుందని వాహనదారులకు సూచించారు. కొత్తకోటతో పాటు,వనపర్తి నియోజకవర్గంలోని పెబ్బేర్ ,శ్రీరంగాపూర్,పెద్దమందడి, ఖిల్లాఘణపూర్ నాలుగు మండలాల పోలీస్ స్టేషన్లస్పెషల్ డ్రంక్అండ్ డ్రైవ్ టెస్టులునిర్వహించడం జరుగుతుందన్నారు.కుటుంబసమేతంగా తల్లిదండ్రులు పిల్లలతో ఇంట్లోనే వేడుకలుజరుపుకోవాలనారు.నాలుగు మండలాల ప్రజలను కోరారు.

## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత



**ఇటిక్యాల, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వావిలాల గ్రామంలో సోమవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాం రెడ్డి, అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన బతుకన్నకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.18 వేల 500ల చెక్కును బిఆర్ఎస్ పార్టీ నాయకుడు వావిలాల రంగారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారునికి పంపిణీ చేశారు.

## సావిత్రిబాయి పూలే జయంతిని జయప్రదం చేయండి



పోస్టల్ విడుదల చేస్తున్న బహుజన విద్యార్థి సంఘాల ఐక్య వేదిక

**వనపర్తి టౌన్ డిసెంబరు30 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాల్లో సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 3 వ తేదీన సావిత్రి బాయ్ పూలే జయంతిని జయప్రదంచేయాలని బహుజన విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పోస్టర్లు విడుదల చేశారు. బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, బిసి విద్యార్థి సంఘ రాష్ట్ర కార్యదర్శి అరవింద్ స్వామి, బిఎస్ఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి తోలరాము మాట్లాడుతూ బహుజన విద్యార్థి సంఘాల ఐక్య వేదిక నాయకులు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసంతన జీవితాంతం పోరాటంచేసిన సంఘ సంస్కర్త మహిళా విద్యాకోసం పాటుపడిన జ్ఞానవనిత భారతదేశ మొట్టమొదటి మహిళాఉపాధ్యాయురాలు చదువుల తల్లిసావిత్రి బాయి పూలే జయంతి వనపర్తిజిల్లాలో 3 తేదీన జయప్రదం చేయాలని కోరారు.

## గిరిజనుల హక్కుల సాధన కోసం అందరు ఐక్యంగా ఉండాలి

**గద్వాల డిసెంబరు 30 ప్రభాతవార్త :** గిరిజనుల హక్కుల సాధన కోసం అందరు ఐక్యంగా ఉండాలని అల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం జోగులాంబగద్వాల జిల్లాలో జమ్ములమ్మ దేవాలయం సమీపంలో ఎస్వి ఈవెంట్ హాల్లో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సమావేశానికి ఏఐబిఎస్ఎస్ అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్సీ, ఎస్‌రాములు నాయక్ ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. అయన అధ్యక్షతన జిల్లా గిరిజనుల సమావేశం జరిగింది. సమావేశంలో గద్వాల జిల్లా గిరిజనులు, ముఖ్య కార్యకర్తలు, ఆక్టివ్ సభ్యులు రాష్ట్రస్థాయి నాయకులు, రాములు నాయక్, ఎం తాన్యా నాయక్, కిషన్ సింగ్ రాథోడ్, ఎస్ రాములు నాయక్,రామావత్ శేఖర్ నాయక్, లావుడియా రాందాస్ నాయక్, ఎం శివనాయక్ సమక్షంలో బంజారా ఆత్మీయ సమ్మేళనము ఘనంగా నిర్వహించడం జరిగింది.

## కాంప్లెక్స్ ఎరువులను వాడాలి

**■ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్**



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్

**ఉప్పునుంతల, డిసెంబరు 30 ప్రభాతవార్త:** డీలర్లు కాంప్లెక్స్ ఎరువులను రైతులకు అందజేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రశేఖర్‌ఫర్టిలైజర్ డీలర్లకు సూచించారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని మార్కెట్ ట్రేడర్ అసోసియేషన్ భవనంలో జరిగిన డివిజన్ స్థాయి ఫర్టిలైజర్ డీలర్ల సమావేశంలో పాల్గొని వారికి అవగాహన కల్పించారు. డివిజన్ స్థాయిలో ఫర్టిలైజర్ డీలర్లు డిఏపి బదులుగా వివిధ రకాల పంటలకు వివిధ రకాల కాంప్లెక్స్ ఎరువులను వాడాలని డీలర్లకు సూచించారు. ఈ సమావేశంలో అచ్చంపేట, ఉప్పునుంతల, బల్మూరు, పదర, అమ్రాబాద్, వంగూరు మండల వ్యవసాయ అధికారులు కృష్ణయ్య,రమేష్,నరేష్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం



కార్గో సేవలను ప్రారంభిస్తున్న దృశ్యం

**మక్తల్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మక్తల్ మండలంలోని జక్లేర్ స్టేజి వద్ద ఆర్టీసీ కార్గో సేవలను సోమవారం మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇషాక్ విన్ మహమ్మద్‌ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 167 వ జాతీయ రహదారిపై రద్దీ ప్రాంతంలో గల జక్లేర్ స్టేజి వద్ద ప్రజల సౌకర్యం కోసం కార్గో సేవలను నూతనంగా ప్రారంభించడం జరిగిందని ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సరసమైన ధరలకే అతి తక్కువ కాలంలోనే ప్రజలకు పార్సిళ్లను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట డిఎంఈ రవికుమార్,షాద్‌నగర్ డిఎంఈ శ్రీనివాస్, నిర్వాహకుడు వెంకటేష్‌గౌడ్, మధుసూదన్‌గౌడ్, బసవరాజ్, శివ కుమార్, వీరేష్, మహదేవ్ పాల్గొన్నారు.

## మేఘన్న అభయహస్తం ద్వారా ఆర్థిక సాయం



**పెబ్బేరు డిసెంబరు 30 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన సంధ్యారాముడు ఆకస్మికంగా చనిపోవడం జరిగింది ఇంకో వ్యక్తి ఆంజనేయులు గౌడ్ చనిపోవడం జరిగింది. ఈ విషయాన్ని వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకుపోగా వారు స్పందించి ఈ విషయాన్ని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలియపరుచగ వారి కుటుంబానికి తక్షణమే మేఘన్న అభయ హస్తం ద్వారా 5000 అయిదు వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయవలసిందిగా ఆదేశించడం అయింది. ఆర్థిక సహాయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు టి వీరస్వామి నాయుడు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సర్పంచ్‌గౌరెడ్డి,రమా మహేశ్వర్‌రెడ్డి,కాశన్న,బక్కన్న, నరసింహారెడ్డి, గాలెన్న, శ్రీనివాసులు, రాముడు, వెంకటేష్, గోపాల్, చిన్న శ్రీనివాసులు, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారుల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**బిజినేపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త:** వెయ్యి గొంతులు లక్ష డప్పులు బిజినపల్లి డప్పు కళాకారుల కమిటీ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజినేపల్లి మండల కేంద్రంలో మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఫిబ్రవరి 3న జరిగే లక్ష డప్పులు, వెయ్యి గొంతులు ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా ఏబిసిడి వర్గీకరణ కోసం ఈ కమిటీని ఎన్నుకున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా గౌరవ సలహాదారు, బోనాసిరాజు, గౌరవ జిల్లా ప్రధాన కార్యదర్శి కె విజయ్ కాంత్, జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రావణ్ కుమార్ అధ్యక్షన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కరిగల్ల దశరథం ఆధ్వర్యంలో అధ్యక్షుడు గా మండల డప్పు కళాకారుల కమిటీనీ ఎనుకున్నారు. అధ్యక్షులుగా చిన్నపాగ శివయ్య, ఉపాధ్యక్షులుగా దుబ్బా రాము, కరియల్ల రాజు, బోనాసి రామకృష్ణ ప్రధాన కార్యదర్శి బోనాసి కురుమయ్య, సంయుక్త కార్య దర్శులు, లి.బాలవెంకట్, శి.ఉదయ్ కుమార్ కోశాధికారి పులిసతీష్, ప్రచార కార్యదర్శులు, వెంకటరత్నం, బైని శ్రీను, కరుణాకర్ మంగి రాజేష్, గౌరవ అధ్యక్షులు డప్పు లక్ష్మణ్ కారుకొండ బాలస్వామిలను ఎన్నుకున్నారు.

## బస్సుజాత ముగింపు సభను విజయవంతం చేయండి

**మాగనూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త:** డిసెంబర్ 31న మంగళవారం రోజు హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర జరుగు ఆశాల రాష్ట్ర బస్సుజాత ముగింపు సభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూరు ఆంజనేయులు పిలుపునిచ్చారు. మాగనూరు మండల కేంద్రంలోకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్‌సి డా. అఫ్రూస్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆశలకు కనీస వేతనం రూ.18000 ఇవ్వాలని పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యం కల్పించాలని కోరుతూ డిసెంబర్ 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాత డిసెంబర్ 31 వరకు కొనసాగిందని తెలిపారు. ఈ బస్సు జాతలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి కార్యదర్శి నీలాదేవి, గంగామణి, బాలమణి, సాధన, సునీత,పద్మ ఎడుగురి బృందంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు జాత నిర్వహించి ఆశాలను చైతన్య పరుస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో పేర్కొన్న విధంగా ఆశలకు కనీస వేతనం 18000 వెంటనే అమలు చేయాలని కోరారు. ముగింపు సభకు జిల్లా వ్యాప్తంగా అన్ని పిహెచ్‌సి పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు హైదరాబాదులో జరిగే ఇంద్ర పార్క్ వద్ద ధర్నాకు తరలి రావాలని కోరారు. ఆశ కార్యకర్తలు సరితా హారిక తదితరులు పాల్గొన్నారు.

## సాధుల మధుసూధన్ ప్యానల్ వైపే ట్రస్మా విజయం

### -న్యాయమే గెలిచింది : ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 30,ప్రభాతవార్త:** ట్రస్మా ఎన్నికల్లో న్యాయమే గెలిచిందని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ స్పష్టం చేశారు. న్యాయబద్ధమై ట్రస్మా ఆన్‌లైన్ ఎన్నికలను ఆపేందుకు కొందరు విశ్వ ప్రయత్నాలు చేశారని, వాటన్నింటిని లెక్క చేయకుండా ట్రస్మా జిల్లా సభ్యులు నిర్భయంగా ఆన్‌లైన్ ఓటింగ్ పాల్గొని తమ ప్యానల్‌ను గెలిపించుకున్నారన్నారు.



ట్రస్మా రాష్ట్ర నూతన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి,కోశాధికారిగా ఎన్నికైనట్లు ధృవీకరణ పత్రాలు అందుకుంటున్న సాధుల మధుసూధన్, రమేష్‌రావు, రాఘవేందర్‌రెడ్డి

రాష్ట్రంలో ట్రస్మా విజయం సాధించినందున సోమవారం జిల్లా కేంద్రంలోని మోనప్ప గుట్టలో ఉన్న జ్ఞానభారతి ఉన్నత పాఠశాలలో జరిగిన విజయోత్సవ సభలో లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివారం జరిగిన ట్రస్మా ఆన్‌లైన్ ఎన్నికల్లో ప్రస్తుత ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూధన్ రెండోసారి తిరిగి తిరు గులేని విజయం సాధించా రన్నారు.ఆదివారం రాత్రి సాధుల మధుసూధన్‌ను గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటిస్తూ అధ్యక్షునిగా ఎన్నికైనట్లు ధృవ పత్రం జారీ చేయడంతో ట్రస్మా మధుసూధన్ ప్యానల్ గెలిచార న్నారు.జిల్లాలో 90పైకి ఓట్లురావడంతో తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ ప్రత్యేక స్థానంలోఉన్నట్లు ట్రస్మారాష్ట్ర నాయకత్వం గుర్తించిందన్నారు. రాష్ట్రంలో ఆన్‌లైన్ ఫలితం ట్రస్మాకు వన్‌సైడెడ్‌గా వెలువడిందన్నారు.నిజాయితీగా ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా గెలుపొందిన ప్రస్తుత ట్రస్మా కమిటీ తిరిగి నూతన కమిటీగా ఎన్నిక కావడం పట్ల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్,పట్టణ అధ్యక్షుడు వంశీమోహన్‌రెడ్డి, సలహాదారు లక్ష్మణ్,జిల్లా మీడియా కన్వీనర్ గొడుగు వేదాంతం వెంకటయ్య, కోకన్వీనర్ కృష్ణ మోహన్‌లతో పాటు ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్, భూత్పూర్ మండల అధ్యక్షుడు డాక్టర్ సత్య నారాయణ,హర్షం వ్యక్తం చేశారు.

**సాహితీ సత్యంకు ఘన సన్మానం:** విద్యా,సామాజిక రంగాలలో విశిష్ట సేవలందిస్తున్నందుకుగాను మనం ఇంటర్నేషనల్ ఫౌండేషన్ శనివారం రాత్రి హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ కళావేదికలో భూత్పూర్ సాహితీ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ సత్యనారాయణ(సత్యం)కు డాక్టరేట్ అవార్డు ప్రదానం చేశారు. ట్రస్మా సభ్యుడైన సత్యనారాయణకు డాక్టరేట్ అవార్డు వచ్చిన సందర్భంగా సత్యనారాయణను ట్రస్మా తరఫున గజమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ట్రస్మాపట్టణ అధ్యక్షుడు వంశీమోహన్‌రెడ్డి,జ్ఞానభారతీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కిరణ్మయితో పాటు జిల్లాలోని వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు వెంకటయ్య,చంద్రకళ,సంపత్,నరేందర్‌జీ, పూజిత,క్రాంతికుమార్,శ్రీనివాసులు,కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## ముందస్తు చర్యలతో వనపర్తి జిల్లాలో నేరాల అదుపు

### ■వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 30 ప్రభాత వార్త:** నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు ముందస్తూ చర్యలతో వనపర్తి జిల్లా పరిధిలో ఈ ఏడాది నేరాలు అదుపులో వుండటంతో పాటు తగ్గు ముఖం పడినట్లుగా వన పర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మీడియా సమావేశంలో తెలియజేసారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి

వనపర్తి జిల్లాలో 2024 సంబంధించి వార్షిక నివేదిక మీడియా సమావేశాన్ని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయములో ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి పోలీసులు ముందస్తూ ప్రణాళికలు, సమాచారంతో నేరాలను పూర్తి స్థాయిలో నియంత్రించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా పోలీసులు నేరాలను కట్టడి చేయడంతో పాటు, నేరస్తులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకంగా మారిందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వార్షిక నివేదిక కార్యక్రమంలో వనపర్తి ఏ ఆర్, అదనపు ఎస్పీ, వీరారెడ్డి, వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు, డిసిఆర్బి, ఉమా మహేశ్వర్, కొత్తకోట సిఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, డిసిఆర్బి ఎస్సై, రవి ప్రకాష్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరద బాధితులకు విద్యార్థుల విరాళాలు

### ■విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 30 ప్రభాత వార్త:** వనపర్తి జిల్లా విద్యార్థులు మానవతా దృక్పథంతో వరద బాధితులకు విరాళాలు సేకరించి ఇవ్వడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రశంసించారు. వరద బాధితుల సహాయార్థం వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులుసామాజిక బాధ్యతగా, స్వచ్ఛందంగా సేకరించిన విరాళాలు రూ. 6,21,100/- (ఆరులక్షల ఇరువై ఒక్క వేలఒక వంద), ఈ మొత్తాన్ని తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి సహాయనిధికి పంపించడం జరిగింది. అట్టి విరాళాల వివరాలను సోమవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా బహిర్గతం చేయడం జరిగింది. విరాళాలు సేకరించిన విద్యార్థులను, సహకరించిన ప్రిన్సిపాల్స్‌ను,ఈ కార్యక్రమాన్ని రూపొందించిన ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్యను జిల్లా కలెక్టర్ అభినందించారు.



## ప్రజావాణి ద్వారా సత్వర న్యాయం

### ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ప్రజావాణి ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం అందుతుందని ఎస్పీ జానకి ధరావత్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.జానకి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత ఎస్ఐ, సిఐ మరియు డీఎస్పీలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. సోమవారం మొత్తం 11 దరఖాస్తులు వచ్చాయి. ప్రజలు నిర్భయంగా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని తెలియజేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి

## కర్నే తండా లిఫ్ట్ కోసం సబ్ స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరు

**ఖిల్లాఘణపురం డిసెంబరు 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కర్నే తాండ ఎత్తిపోతల పథకా నికి ఎలక్ట్రికల్ లైన్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం ఒక కోటి 64 లక్షల రూపాయల నిధులు మంజూ రు చేసిన ప్రణాళిక రోడ్డు వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డికి మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్‌తో పాటు పలువురు గిరిజన సర్పంచులు కృతజ్ఞతలు తెలియజేశారు.సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసి ప్రారంభించిన కర్ణ తాండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిధులు లేకపోవడంతో ఆగిపోయాయి. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించి వచ్చే వర్షాకాలం నాటికి మామిడి మాడ లట్టుపల్లి షాపూర్ గ్రామం తో పాటు 10 గిరిజన తండాలలోని ఐదువేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆయన తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన చిన్నరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పీనా నాయక్, మన్యం గౌడ్ నరేష్ నాయక్ దేవుడు నాయక్, మాజీ ఎంపిటిసి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన జీఓ కాపీని అందజేస్తున్న జిల్లెల చిన్నారెడ్డి

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**బిజినపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త:** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు పడకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా షీ టీం ఇన్చార్జ్ విజయలక్ష్మి సూచించారు. నంది వడ్డేమాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. షీ టీం ఇన్చార్జ్ విజయలక్ష్మి మాట్లాడుతూ వాట్సాప్ ఇన్స్టాగ్రామ్‌లను నమ్మి మోసపోవద్దు అని సూచించారు. చదువుకునే విద్యార్థిని విద్యార్థులు మొబైల్ ఫోన్లో వాట్సాప్ ఫేస్బుక్ ఇన్స్టాగ్రామ్ ల ద్వారా చాటింగ్ చేసి మోసపోతున్నారు ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే షీటీం ను సంప్రదించాలని కోరారు. చదువుకునే వయసులో విద్యా ర్థులు సబ్జెక్టులనే స్నేహితులుగా భావించాలని వాట్సాప్ ఇన్స్టాగ్రామ్ స్నేహాలను నమ్మి అనవసర సమస్యలు కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు.ఫోక్సో చట్టం గురించి అవగాహన చేసుకోవాలని ఏదైనా సమస్య వస్తే పోలీసులను సంప్రదించాలని భరోసా ఇంచార్జ్ శ్రీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంత్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రమోహన్ రెడ్డి, జయలక్ష్మి, వెంకటస్వామి,పాల్గొన్నారు.



## శ్రీకురుమూర్తి కొండకు భక్తుల తాకిడి

**చిన్న చింతకుంట,డిసెంబరు30 ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి కొండకు భక్తులు భారీగా తరలి వచ్చారు. సోమవారం ధనుర్మాస అమావాస్య కావడంతో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కాలినడకన స్వామివారి కొండకు ఉదయాన్నే చేరుకున్నారు. స్వామివారి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి కొండ దిగువ నుంచి ప్రధాన మెట్ల మీదుగా స్వామి వారి సన్నిధి వరకు భక్తులు చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. కొండ దిగివన భక్తులు దీపాలు వెలిగించి స్వామివారిని స్మరించుకున్నారు. స్వామి వారికి అంప్లి ఫైర్ బహుకరణ, పాలెం గ్రామం హనుమంత్‌రెడ్డి అనే భక్తుడు స్వామివారికి రూ.50 వేల విలువగల 500 వాట్స్ ఆంప్లీఫైర్ ను దేవస్థాన అధికారులకు అప్పగించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి గోవర్ధన్‌రెడ్డి, పాలకమండల్ సభ్యులు ఉంద్యాల శేఖర్,శ్రీధర్ రెడ్డి,దేవస్థాన అధికారులు శివానంద చారి తదితరులు ఉన్నారు.



శ్రీకురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

## మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

### మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి : నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, డిసెంబరు30 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, మాదకద్ర వ్యాల వల్ల కలిగే అనర్థాలపై జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో మాదక ద్రవ్యాల నిషేధం( నార్కోటిక్ (డ్రగ్స్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడాతూ జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారా? లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డిఎస్‌పి నల్లపు లింగయ్య మాట్లాడుతూ జిల్లాలోని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇటీవలే కోస్గి పట్టణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలోమాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. గతంతో పోలిస్తే డ్రగ్స్ కేసులు చాలాతక్కువ అయ్యాయని ఆయన తెలిపారు. టాస్క్ ఫోర్స్,స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్‌పై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టడం జరిగిందని డిఎస్పీ వివరించారు. కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా ఆబ్కారీ శాఖ అధికారులు కూడా మాదకద్రవ్యాల నిషేధంపై కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి నేతత్వంలోనూ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాల న్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు సైతం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల నెలవారి సమావేశాలలో డ్రగ్స్ నిషేధం గురించి తెలిపి క్షేత్ర స్థాయిలో వారిద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకో వాలన్నారు. డ్రగ్స్ నిషేధంపై నిర్వహిం చిన కార్యక్రమాల నివేది కను తయారుచేసి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. సమా వేశంలో ఆబ్కారీ శాఖ అధికారిఅశోక్ కుమార్ ఇటీవలే పట్టుకున్న ఆల్ఫాజోలం గురించికలెక్టర్‌కు తెలుపుతూ2015 (గతపదేళ్ల) తర్వాతమళ్ళీఆల్ఫా జోలం కేసు నమోదు అయిం దని తెలిపారు. మాదక ద్రవ్యాలనుజిల్లాలో పూర్తిగా నిషేధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఈ సంద ర్భంగాకలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రామచంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, డిఇఓ గోవిందరాజులు, డిఐఈఓ సుదర్శన్, ఆర్టీవో మేఘా గాంధీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి సి సెక్షన్ అధికారినిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, హాజరైన అధికారులు

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

### -ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబరు 30 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.మండలంలోని పెద్దాపూర్ గ్రామపంచాయతీకి చెందిన కాయితీ ప్రభాకర్ రెడ్డి రూ.48000, నీలం లింగమయ్య రూ.60000, హిమబిందు సాగరిక రూ.19 వేల రూపాయల చెక్కులను సోమవారంహైదరాబాదులో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీడైరెక్టర్ కేశమల్ల కృష్ణ, వరికుప్పల ఆంజనేయులు, అనిల్ కుమార్, మల్లేష్, సురేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని ప్రజావాణిలో వినతి

**వెల్దండ, డిసెంబరు 30 ప్రభాతవార్త:** మండలంలోని కుప్పగండ్ల గ్రామపంచాయతీ పరిధిలో గొల్లోనిపల్లిని నూతన గ్రామపంచాయతీ చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకులు సోమవారం ప్రజావాణిలో తహసిల్దార్ కార్తీక్ కుమార్‌కు వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాల నిమిత్తం నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్, జగన్, శ్రీకాంత్, బాలరాజ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## న్యూ ఇయర్ వేడుకలను సంతోషంగా జరుపుకోవాలి

### ◆ 31 రాత్రి నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవు: డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని డీఎస్పీ నల్లపు లింగయ్య కోరారు. ఈ సందర్భంగా డిఎస్పీ ఎన్. లింగయ్యఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈనెల 31న రాత్రి జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బ్రీత్ అనలైజర్‌లతో తనిఖీలునిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్‌చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు ఎవరు అతిక్రమించిన కఠిన చర్యలు తప్పవన్నారు. న్యూ ఇయర్ వేడుకలు 12:30 గం.ల లోపు ముగించుకోవాలని రోడ్డు పైన కేక్ కటింగ్, న్యూసెన్స్ చేసిన లేక ఈవ్ టీజింగ్ లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే వారిని అరెస్టు చేసి జైలుకు పంపడం జరుగుతుంది. బహిరంగ ప్రదేశాల్లో సౌండ్ బాక్స్ డీజే లను ఉపయోగించొద్దని, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం నిషేధమని మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని, వారి వల్ల ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే వారి సంరక్షకుల పైన కేసులు నమోదు చేస్తామన్నారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారంకఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు. మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో క్లోజ్ చేయాలని, మైనర్లకు మద్యం అమ్మకూడదని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని, జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తామని పై అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని డీఎస్పీ ప్రజలకు సూచించారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరి యువకులు దుర్మరణం



మృతి చెందిన శ్రీనాథ్, భాను ప్రమాదానికి గురైన బైక్

**ఊర్కొండ, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడ్డ ఘటనలో కల్వకుర్తి పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనాథ్ (20), బలరాంనగర్ కాలనీకి చెందిన భాను (21) లు జడ్చర్లనుండి కల్వకుర్తి పట్టణానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఊర్కొండ మండలంలోని జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి లోని కొత్త కాటన్ మిల్లు వద్ద ప్రయాణిస్తున్న పల్సర్ ద్విచక్ర వాహనంఅదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు ఘటన స్థలంలోనే మృతి చెందారని, మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

## సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబరు 30 ప్రభాతవార్త:** నాగంకర్నూల్ పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు హొదేకార్ నాగేశ్వర్‌రావు సోమవారం మృతి చెందారు. ఆయన అంత్రక్రియలు మంగళవారం ఉదయం 9 గంటలకు నాగర్‌కర్నూల్‌లోజరుగుతాయనికుటుంబ సభ్యులుతెలి పారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కూచుకుళ్ళ నాగేశ్వరరావు మృతి పట్ల ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఆయన నివాసంలో నాగేశ్వరరావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులనుపరామర్శించి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో ఇప్పటివరకు వెన్నంటిఉన్న నాగేశ్వరరావు మృతి వ్యక్తిగతంగా తనకు తీరని లోటని దామోదర్‌రెడ్డి అన్నారు.ఆయన మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతినిసానుభూతిని వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు హోదా కార్ నాగేశ్వరరావు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దండ, డిసెంబరు 30 ప్రభాతవార్త:** వెల్దండ మండలం కుప్పగండ్ల గ్రామానికి చెందిన జల్లెల్ల యాదయ్య అనారోగ్యం తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న మొక్తాల రమేష్ సోమవారం రూ.10వేల రూపాయలను వైద్య ఖర్చు లకు యాదయ్యకు అందించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో శానమోనికృష్ణయ్య, ఎండి.బాబా, బాలరాజు, హరికృష్ణ,రాజుగౌడ్, రమేష్‌గౌడ్, మహేష్ ముదిరాజ్, నరసింహ, శేఖర్, హనీఫ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



## మేకల చోరీ: కేసు నమోదు

**వెల్దండ, డిసెంబరు 30 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన ఉడుత లాలయ్యకు చెందిన 8 మేకలు ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయి. వివరాల్లోకి వెళ్తే..లాలయ్య తనకున్న11 మేకలను గ్రామంలోని తన ఇంటి వద్ద దొడ్డి ఏర్పాటు చేసి దొడ్డిలో ఉంచి ఇంట్లో నిద్రపోయాడు. రాత్రి 12 గంటల సమయంలో బయటికెళ్లి దొడ్డివైపు చూడగా దొడ్డిలో మేకలు లేకపోవడంతో 100 సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.1 లక్ష వరకు ఉంటుందని లాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఉడుత శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

## అనాథ ఆశ్రమంలో నిత్యవసర సరుకుల పంపిణీ

**జడ్చర్ల, డిసెంబరు 30, ప్రభాతవార్త:** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి జన్మదిన సందర్భంగా టచ్ అనాథ ఆశ్రమంలో మాజీ వార్డు సభ్యుడు ,మాజీ ముడా డైరెక్టర్ వై.జి.ప్రీతం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. మహబూబ్ నగర్ అప్పన్నపల్లిలో టచ్ అనాథ ఆశ్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి జన్మదిన సందర్భంగా వై.జి.ప్రీతం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు హ్యాపీ బర్త్డే అనిరుధ్‌రెడ్డి అని శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ డి.శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కాశీ విశ్వనాథ్, ఆశ్రమ నిర్వాహకులు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కును కాపాడాలని కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

**వనపర్తి క్రైమ్ డిసెంబరు 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మలికి మియాన్ పల్లి, గ్రామానికి చెందిన పల్లె ప్రకృతి వనాన్ని కాపాడాలని సోమవారం గ్రామానికి చెందిన 50 మంది గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.నాలుగు సంవత్సరాల క్రితం ఉపాధి హామీ పథకంలో భాగంగా దేవాలయం ప్రక్కన సర్వే నంబర్ నాలుగులో ప్రభుత్వ స్థలంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామానికి గ్రామపంచాయతీ భవనం మంజూరు అయింది. పార్కుకు రెండు వైపులా సర్వేనంబర్ నాలుగు లోని ప్రభుత్వ స్థలం ఇద్దరి కబ్జాలో ఉన్నదని ప్రభుత్వ స్థలాన్ని వదిలేసి పార్కును తొలగించి పార్కులో జి పి భవనం కట్టాలని శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారనికబ్జాకు గురైనప్రభుత్వ స్థలంలోనే గ్రామపంచాయతీ భవనం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

## ద్విచక్ర వాహనంపై నుండి కిందపడి వ్యక్తి మృతి

**తెలకపల్లి, డిసెంబరు 30 ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుండి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది స్థానిక ఎస్సై బి నరేష్ అందించిన వివరాల ప్రకారం మండల పరిధిలోని బండపల్లి గ్రామానికి చెందిన గన్నోజు శివకుమార్ (27) సంవత్సరాలు, ఆదివారం రాత్రి బండపల్లి గ్రామం నుండి టీఎస్ 07 బీబి 4580 గల ద్విచక్ర వాహనంపై తెలకపల్లి మండల కేంద్రానికి వచ్చి మరల బండపల్లికి తిరుగు ప్రయాణంలో వెళ్ళుచుండగా మండల పరిధిలోని దాసుపల్లి గ్రామ శివారులో గల డంపింగ్ యార్డ్ వద్ద ప్రమాదవశాత్తు తన ద్విచక్ర వాహనంపై నుండి కింద పడితలకు, ఎడమ భుజానికి తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు చికిత్సనిమిత్తం నాగర్‌కర్నూలు జిల్లా ఆసుపత్రికి తరలించగాఅప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు ఎస్సై తెలిపారు.మృతుని అన్నగన్నోజు నరేష్ సోమవారంఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నరేష్ తెలిపారు.

## భక్తులకు అన్నదానం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** అమావాస్య సందర్భంగా దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు కొడ్లిశరణప్ప ఆధ్వర్యంలోఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారినిదర్శిం చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తుల కు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదానకార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మెట్టుగడ్డఆంజనేయస్వామిసన్నిధివద్దప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**నారాయణపేట టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త :** అమావాస్య సందర్భంగా దామరగిద్ద మండలం క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు కొడ్లి శరణప్ప ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా మెట్టుగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు స్వామి వారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులను అరెస్టు చేయడం సరికాదు

### సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు ఎల్లాగౌడ్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 30 ప్రభాతవార్త:** సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా జరుగుతున్న సమ్మెలో అసెంబ్లీ ముట్టడి పేరుతో పోలీసులు అరెస్టు చేయడం సమంజసం కాదని సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు ఎల్లాగౌడ్ అన్నారు. సోమవారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం పేట జిల్లా కేంద్రంలో 20 రోజుల సమ్మె కొనసాగుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు.అసెంబ్లీ ముట్టడి పేరుతో పోలీసులు ముందస్తుగా నారాయణపేట, దామరగిద్ద,ధన్వాడ, మరికల్ తదితర మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులను అరెస్టు చేశారన్నారు. అరెస్టు ఉద్యమాన్ని ఆపలేరని సమస్య పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు అరెస్టులకు భయపడకుండా ఐక్యంగా ఉండి పోరాడవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.అసెంబ్లీ ముట్టడికివెళ్లడం లేదని సమ్మెకు వెళుతున్నామని చెప్పిన పోలీసులు అరెస్టు చేయడం ఇంతవరకు సమంజసమన్నారు. ఉద్యమంతోనే సమస్యలు పరిష్కారం సాధ్యమన్నారు.

## ఘనంగా బీజెహెచ్‌పిఎస్ వ్యవస్థాపక దినోత్సవం

**గద్వాల డిసెంబరు 30 ప్రభాతవార్త :** బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కు పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా పట్టణంలో బీజె హెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సిరిగిరి మన్యం, ఆల్ ఇండియా అధ్యక్షుడు కోడిగంటి నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరిగిరి దేవరాజు, జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు సోమన్న, జిల్లా అధ్యక్షుడు అశ్వ మారెప్ప, మాజీ జిల్లా అధ్యక్షుడు సిరిగిరి కృష్ణ , జిల్లావర్కింగ్ అధ్యక్షుడు బయలుపాటి బసన్నలు సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా పట్టణ కేంద్రంలోని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి 23వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ కి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులాగా జిల్లా అధ్యక్షుడు అశ్వ మారెప్ప,మాజీ జిల్లా అధ్యక్షుడు సిరిగిరి కృష్ణ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వ పాలకులుబేడ,బుడగ జంగంజాతిని విద్యా, ఉద్యోగ, రాజకీయ అన్ని రంగాల్లో అనగదొక్కినారన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు బేడ, బుడగ,జంగాలకు అందించాలని డిమాండ్ చేశారు.మన పిల్లలను,మనము విద్యావంతులుగా తీర్చిదిద్దుకున్న నాడే మనకు స్వతంత్రం వచ్చినట్లని అన్నారు. అదే విధంగా బేడ, బుడగ జంగం హక్కుల పోరాట సమితి స్థాపించి 23 సంవత్సరాలు కావస్తుందని, ఈ యొక్క హక్కుల పోరాట సమితి దేశవ్యాప్తంగా,తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, కర్ణాటక,మహారాష్ట్ర, రాష్ట్రాలలో జాతి బలోపేతం చేసుకున్నాం అన్నారు. ఇకనుండి ఎంతో ఐక్యమత్యంతో ముందుకు సాగి అన్ని రంగాల్లో జాతిని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ తో బేడ, బుడగ జంగాలుకు 7 వాటా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోగులాంబ గద్వాల జిల్లా ఉపాధ్యక్షులు గంజాయి బీసన్న,సవరన్న, కొండన్న, సాయిబాబు పట్టణ అధ్యక్షుడు నాగేశ్, పెద్ద మద్దిలేటి, ఆంజనేయులు, రాజ కృష్ణ,శంకరయ్య,బాల రంగడు, రాజు,బొబ్బిలి, కృష్ణ,పర్వ,రామలింగం, ఈశ్వర్ పాల్గొన్నారు.